ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 వరంగల్

సోమవారం 5 ఫిబ్రవరి 2024



భక్తజన హోరు

వనదేవతల సన్నిధిలో కిక్కిరిసిన జనం

- వారాంతపు రోజు భక్తుల కిటకిట
- భారీగా ముందస్తు మొక్కులు




మేడారం కిక్కిరిసిపోయింది. వనదేవతలను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆదివారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహా జాతరకు ముందుగానే సమ్మక్క, సారలమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. వారాంతపు సెలవు కావడంతో కుటుంబ సమేతంగా మేడారం చేరుకున్నారు. ముందుగా జంపన్నవాగులో స్నానాలు ఆచరించారు. కల్యాణకట్ట వద్ద తలనీలాలు సమర్పించి వనదేవతల గద్దెల వద్దకు క్యూలైన్ల ద్వారా చేరుకొని మొక్కులు చెల్లించారు. సుమారు ఐదు లక్షల మంది తల్లులను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. - మేడారం

7



కొత్త పనులకే సీడీఎఫ్



- నియోజకవర్గానికి రూ.10కోట్ల చొప్పున కేటాయింపు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు రూ.120కోట్ల విడుదల
- పాఠశాలల్లో సౌకర్యాలకు 10శాతం..
- తాగునీటి అవసరాలకు 30 శాతం..
- కార్యాలయాల నిర్వహణకు 5 శాతం..
- మిగతా 65శాతం సంక్షేమ, అభివృద్ధి పనులకు కేటాయింపు..
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో ఖర్చు చేసేలా ఉత్తర్వులు

వరంగల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నియోజకవర్గాల అభివృద్ధి నిధుల (సీడీఎఫ్) వినియోగంపై ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నిధులు గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన పను లకు మళ్లించకుండా ప్రభుత్వం దృష్టిసారించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రుల అనుమతితో సీడీఎఫ్ ఖర్చు చేయాలని ఉత్తర్వులు జారీ చేస్తూనే.. కొత్త పనులకు మాత్ర మే వినియోగించాలని ఆదేశించింది. ఇటీవల ప్రతీ నియోజకవర్గానికి రూ.10కోట్ల చొప్పున ప్రభుత్వం సీడీఎఫ్ కేటాయించింది. ఈ నిధుల్లో 35శాతం వివిధ శాఖలకు ఖర్చు చేయాలని ప్రభుత్వం పేర్కొనగా, మిగతా 65శాతం అభివృద్ధి, సంక్షేమ పనులకు ఖర్చు చేసేందుకు ఎమ్మెల్యేలకు వీలు కల్పించింది. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు నియోజకవర్గాల్లో కొత్తగా చేపట్టాల్సినపనులను గుర్తించే పనిలో పడ్డారు.

ప్రభుత్వ బడులపై ప్రత్యేక నజర్

సీడీఎఫ్ నిధుల్లో 20శాతం సర్కారు పాఠశాలలను బలోపేతం కోసం వినియోగించనున్నారు. ప్రస్తుతం ఉన్న బడులను బలోపేతం చేయటం, శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను మరమ్మతులు చేయటం, ప్రహరీ నిర్మాణం, మూత్రశాలలు, మరుగుదొడ్లు, వంట గదుల నిర్మాణం, క్రీడా సామగ్రి కొనుగోలు, తదితర అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించారు. ప్రతీ నియోజకవర్గంలో ప్రభుత్వ బడి కోసం ఖర్చు చేసేందుకు రూ.2కోట్లు కేటాయించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రూ.24కోట్లు పాఠశాలల అభివృద్ధికే ఖర్చు చేయనున్నారు. ఇందుకోసం విద్యాశాఖలోని ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఎక్కడెక్కడ నిధులు అవసరమో మండలాల వారిగా నివేదికలు సిద్ధం చేస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులకు అసౌకర్యాలు లేకుండా ప్రైవేటు పాఠశాల లకు దీటుగా విద్యా బోధన జరిగేలా ప్రభుత్వం దృష్టిసారిస్తోంది.

తాగునీటికి కేటాయింపులు

నియోజకవర్గాల అభివృద్ధి నిధుల్లో 10శాతం తాగునీటికి కేటాయించింది. ప్రతీ నియోజకవర్గంలో రూ.కోటి చొప్పున ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రూ.12కోట్లు కేటాయించింది. ఈ నిధులతో గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రధానంగా చేతి పంపుల మరమ్మతులు, నల్లా లీకేజీలు, పైపులైన్ నిర్మాణం, మంచి నీటి బావుల పూడిక తదితర పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాలకు మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయి. అయితే లీకేజీలతో తాగునీరు కలుషితం అవుతున్నాయి. వీటిపై దృష్టిపెట్టడంతో పాటు మిషన్ భగీరథ నీళ్లురాని ప్రాంతాలకు కొత్తగా పైపులైన్ నిర్మాణంపై చర్యలు తీసుకోనున్నారు.

కార్యాలయాల నిర్వహణకు..

ప్రతీ నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు రూ.50లక్షల నిధులను వినియోగించను న్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రూ.6కోట్ల వరకు ఖర్చు చేయనున్నారు. మండలస్థాయి ప్రభుత్వ కార్యాలయాల నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ఈ నిధులను ఖర్చు చేస్తారు. కార్యాలయాల మరమ్మతులతోపాటు ఇతర సామగ్రి కొనుగోలు, నిర్మాణాలకు నిధులను ఖర్చు చేసే అవకాశం ఉంది.

సంక్షేమ పథకాల కోసం..

ప్రభుత్వం మంజూరు చేసే ప్రత్యేక పనులు, సంక్షేమ పథకాల కోసం ఈ మిగతా 65శాతం నిధులను ఖర్చు చేయనున్నారు. ఒక్కొక్క నియోజకవర్గానికి రూ.6.50కోట్ల నిధులు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేసే అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.78కోట్ల నిధులు ఎమ్మెల్యేలు అభివృద్ధి పనుల కోసం వినియోగించేలా ప్రభుత్వం వీలు కల్పించింది. అయితే ఈ నిధులను ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. నియోజకవర్గ స్థాయిలో అధికారులు అభివృద్ధి పనులను గుర్తించి, ఎంత ఖర్చుఅవుతుంతో అంచనాలు తయారు చేసి సంబంధిత శాఖ జిల్లా అధికారికి పంపిస్తారు. సదరు జిల్లా అధికారి సంబంధిత జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపిస్తారు. వీటిని కలెక్టర్లు పరిశీలించి ప్రణాళిక శాఖ ద్వారా ఇన్‌చార్జి మంత్రికి పంపిస్తారు. ఆయన ఆమోదంతో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవుతాయి. దీంతో ఈ నిధులను పాత పనులకు మళ్లించకుండా చెక్ పెట్టడంతోపాటు అధికార పార్టీ కనుసన్నుల్లో పనులు జరిగే అవకాశం ఉంది.

రూ.10కోట్లకు పెంపు

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గాల అభివృద్ధి నిధుల (సీడీఎఫ్)ను భారీగా పెంచింది. 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్.. ప్రతీ నియోజకవర్గానికి అభివృద్ధి పనుల కోసం రూ.3కోట్లు కేటాయించింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో కరోనా కారణంగా ఈ నిధులు కూడా ప్రభుత్వం కేటాయించలేదు. ఆ తరువాత 2021-22ఆర్థిక సంవత్సరంలో సీడీఎఫ్ నిధులను రూ.3కోట్ల నుంచి ప్రభుత్వం రూ.5కోట్లకు పెంచింది. ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీలకు కూడా సీడీఎఫ్ కేటాయించింది. అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సీడీఎఫ్‌ను రెండింతలు చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధి కోసం రూ.120కోట్లు విడుదల చేసింది. గత ప్రభుత్వం ఎమ్మెల్సీలకు కూడా ఎమ్మెల్యేలతో సమానంగా సీడీఎఫ్ విడుదల చేసింది. కాంగ్రెస్ పార్టీకి శాసనమండలిలో ఎమ్మెల్సీల సంఖ్య తక్కువగా ఉండటంతో వారికి నియోజకవర్గాల అభివృద్ధి నిధులు కేటాయింపులు ఉంటాయా? అనేది చర్చనీయాంశంగా మారింది. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఎమ్మెల్సీ కూడా లేరు.



సమావేశంలో మాట్లాడుతున్న సునితారావు

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలి

- కమిటీల నిర్మాణంతో మహిళా కాంగ్రెస్ బలోపేతం
- మోదీ హయాంలో మహిళలకు కరువైన రక్షణ
- రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 4: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండు లోకసభ స్థానాలను పార్టీ కైవసం చేసుకునేందుకు మహిళా కాంగ్రెస్ నా యకులు అంకితభావంతో కృషి చేయాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు అన్నారు. ఆదివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యా లయంలో లోక్‌సభ ఎన్నికల క్రమంలో వరంగల్ సెగ్మెంట్ మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశం జరిగింది. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వరంగల్ ఉమ్మడి జిల్లాలోని మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సునితారావు మాట్లా డుతూ.. కమిటీల నిర్మాణంతో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని, ఈ మేరకు వరంగల్ ఉమ్మ డి జిల్లాలో వార్డు స్థాయి నుంచి జిల్లా కమిటీల వరకు యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ చర్యలు చేపట్టాలని జిల్లా అధ్యక్షులను ఆదేశించారు. నామి నేటెడ్ పోస్టుల్లో మహిళా కాంగ్రెస్ నాయకులకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరనున్నట్లు చెప్పారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలపై విస్తృత ప్రచారం

మిగతా 8వ పేజీలో..

నేడు బల్దియా ప్రజావాణి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 4: వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుంది. హనుమకొండలోని ప్రధాన కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు ప్రజావాణి ప్రారంభం కానుంది. కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా తదితర అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు.

నేటి కలెక్టరేట్ గ్రీవెన్స్ రద్దు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 4: జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రతీ సోమవారం జరిగే ప్రజావాణి గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలన పరమైన కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విషయాన్ని గమనించి జిల్లా ప్రజలు ఫిర్యాదులు ఇచ్చేందుకు కార్యాలయానికి రాకూడదని తెలిపారు.

6న రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

దుగ్గొండి ఫిబ్రవరి 4 : నర్సంపేట పట్టణంలోని మినీ స్టేడియంలో ఈనెల 6న ఉమ్మడి జిల్లాస్థాయి రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఉంటాయని ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శానబోయిన రాజ్‌కుమార్ వెల్లడించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ 6న నిర్వహించే జూనియర్, సబ్ జూనియర్ రెజ్లింగ్ క్రీడాకారులను ఎంపిక చేయడం జరుగుతుందని, ఎంపికైన క్రీడాకారులు 7, 8 తేదిలలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ క్రీడాపోటీలలో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోచ్‌గాలు దేవేందర్, మహేశ్‌లు వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కోశాధికారి కందికొండ రాజులు పాల్గొన్నారు.

కొడుకుతో కలిసి చెరువులో దూకిన తల్లి..

- అన్నారంషరీఫ్ చెరువులో పడి తల్లీకొడుకుల ఆత్మహత్య
- 2న తల్లి, నేడు కుమారుడి మృతదేహం లభ్యం
- అత్తింటి వేధింపులే కారణమని మృతురాలి తండ్రి ఫిర్యాదు
- మృతులది వరంగల్‌లోని శంభునిపేట

పర్వతగిరి/కరీమాబాద్, ఫిబ్రవరి 4 : అత్తింటి వేధింపులు తాళలేక ఏడు నెలల కుమారుడితో తల్లి చెరువులో దూకగా, తల్లి మృతదేహం ఈనెల 2న, కుమారుడి మృతదేహం ఆదివారం చెరువులో లభ్యమైన ఘటన పర్వతగిరి మండలంలోని అన్నా రం షరీఫ్ గ్రామంలో చోటు చేసుకుంది. ఆదివారం బాలుడి మృతదేహంలభ్యం కాగా, ఆ వివరాలను ఎస్సై వీరభద్రరావు తెలిపారు. ఆయన కథనం ప్రకా రం. వరంగల్‌లోని శంభునిపేటకు చెందిన తస్లీం సుల్తానా(25) తన కుమారుడు తన్మూర్(7 నెలలు) ఈ నెల ఒకటో తేదీ నుంచి కనిపించడం లేదని మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ క్రమంలో 2న పర్వతగిరి మండలంలోని అన్నా రంషరీఫ్ దర్గా చెరువులో తస్లీం సుల్తానా మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు అక్కడకి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం పంపించారు. కాగా, మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు మేరకు మృతురాలి కుమారుడి కోసం గజ ఈతగాళ్లతో వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, పర్వతగిరి పోలీసుల సహకారంతో రెండు రోజుల పాటు గాలింపు చేపట్టగా ఆదివారం బాలుడి మృతదేహం లభ్యమైంది. దీంతో బాలుడి మృతదేహాన్ని మిల్స్ కాలనీ పోలీసులకు విచారణ నిమిత్తం అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.



తస్లీం సుల్తానా, తన్మూర్ (ఫైల్)

అత్తింటి వేధింపులే కారణం..

అత్తింటివారి వేధింపులు భరించలేకనే తస్లీం తన 7 నెలల కుమారుడితో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. మిల్స్ కాలనీ పోలీసు కథనం ప్రకారం. కరీంనగర్‌కు చెందిన షేక్ అఫ్జల్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి కుమారుడు, కూతురు తస్లీం ఉన్నారు. తస్లీంకు 19 నెలల క్రితం నగరంలోని శంభునిపేట ప్రాంతానికి చెందిన రోజువారి కూలి పని మహ్మద్ తన్వీర్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వివాహ సమయంలో రూ.1.50లక్షల నగదు, 3 తులాల బంగారం, 26 తులాల వెండితో పాటు బైక్ కింద రూ.లక్ష నగదు ముట్టచెప్పారు. బైక్ కోసం మరో రూ. 26 వేలు ఇవ్వాల్సి ఉంది. ఈ దంపతులకు ఏడు నెలల వయసున్న కుమారుడు(తైమూర్) ఉన్నాడు. తన్వీర్‌తో వివాహం జరిగిన నాటి నుంచి బైక్‌కు ఇవ్వాల్సిన రూ.26వేలతోపాటు ఇంకా అదనపు కట్నం తీసుకురావాలని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేసేవాడు. భర్తతోపాటు అత్త అఫ్జల్‌బీ, మామా మహమూద్, ఆడబిడ్డ భర్త జాఫర్‌లు వేధించేవారు. ఈనెల 1న తస్లీంను ఎవరితోనూ ఫోన్ మాట్లాడవద్దంటూ కొట్టినట్లు శంభునిపేటలోని వరుసకు చిన్నమ్మ ఫాతిమా వద్దకు వచ్చి తస్లీం వాపోయింది. ఆమె సర్దిచెప్పి తిరిగి పంపించింది. అదేరోజు వేధింపులు భరించలేక సాయంత్రం 4 గంటలకు తన కుమారుడిని తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తస్లీం కనిపించడం లేదనే విషయం తెలుసుకున్న తన బంధువు ఫాతిమా అంతటా వెదకడం ప్రారంభించిన ఫలితం కనిపించలేదు. అదే రోజు రాత్రి మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో తస్లీం కనిపించడం లేదంటూ దరఖాస్తు చేసింది. కాగా మిల్స్‌కాలనీ పోలీసులు తస్లీం తండ్రికి ఫోన్ చేసి ఓ వివాహిత మృతదేహం పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ దర్గా చెరువులో లభ్యమైనట్లు, మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు తస్లీం తండ్రి షేక్ అఫ్జల్‌కు తెలిపారు. విషయం తెలుసుకున్న తస్లీం తండ్రి అఫ్జల్ వచ్చి చూడగా ఆ మృతదేహం తన కూతురిదే అని నిర్ధారించారు.

తన కూతురు ఆత్మహత్య చేసుకునేలా వేధింపులకు గురిచేసిన భర్త తన్వీర్, అత్త, మామ, ఆడబిడ్డ తస్లీమా, ఆమె భర్త జాఫర్, బావ ఫారుక్, యారాలు షాజహాపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తస్లీమా తండ్రి షేక్ అఫ్జల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ సీఐ టి.సురేష్ తెలిపారు.

మళ్లీ 'పైరవీ' బదిలీలు

- హాట్ టాపిక్‌గా మారిన 'చెక్ స్లిప్ ట్రాన్స్‌ఫర్స్'
- ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పదుల సంఖ్యలో సిఫారసులు
- ఆరోగ్య సమస్యలంటూ కొందరు ఉపాధ్యాయుల ఆర్జీ
- డీఎస్ఈ నుంచి డీఈవోలకు ఫైళ్లు

వివరాలు : 7లో..



'చిల్లర' గ్యాంగులు!

వరంగల్, హనుమకొండ నగర శివార్లలో కొంత కాలంగా లంపెన్ గ్యాంగులు, నకిలీ పోలీసుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. తాగుడు తదితర జల్సాలు, విలాసవంతమైన జీవితాలకు అలవాటు పడి ఒళ్లు వంచి పనిచేయ చేతకాని కొందరు యువకులు అక్రమ సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. తప్పులు చేస్తూ దొరికేవరకు దొరల్లా తిరిగి దొరికిన తర్వాత దొంగల్లా జైలు జీవితం అనుభవిస్తున్నారు. నగర శివార్లలో ఉన్న వ్యభిచారగృహాలు, ఒంటరి మహిళలు, ప్రేమ జంటలను టార్గెట్ చేసి అందినకాడికి దోచుకుంటున్నారు. రోజు రోజుకూ నగర శివార్లలో నకిలీ పోలీసులు, దోపిడీ గ్యాంగుల ఆగడాలు శ్రుతిమించుతున్నాయే తప్ప తగ్గడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- నగర శివార్లలో రెచ్చిపోతున్న ఆకతాయిలు
- వ్యభిచార గృహాలు, ప్రేమ జంటలే లక్ష్యంగా దోపిడీ పర్వం
- వంగపహాడ్‌లో పోలీసులమంటూ బెదిరింపులు, దాడులు
- అరెస్టు చేసి జైలుకు తరలించిన పోలీసులు
- మిగతా ప్రాంతాలపై కూడా దృష్టి సారించాలంటున్న జనం



హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 4: హనుమకొండ, వరంగల్, కాజీపేట శివారు గ్రామాల్లో చిల్లర గ్యాంగులుగా ఏర్పాటు చేసుకున్న యువకులు రెచ్చిపోతున్నారు. నగరం నుంచి ఒంటరిగా గ్రామాలకు వెళ్లే మహిళలను, అమాయకులను లక్ష్యంగా చేసుకుని దోపిడీ చేస్తున్నారు. ముందుగా ఆటోలో కానీ.. ద్విచక్రవాహనంపైగానీ వెళ్లే వారిని వెంబడించి మార్గమధ్యలో అడ్డుకుని బంగారం, నగదును లాక్కొని వెళుతున్నారు. కొందరైతే ఈ ప్రాంతంలో దొంగలుగా సంచరిస్తున్నారు. మెడలో ఉన్న సొమ్ములు తీసిదాచుకోమని చెప్పి మాటలతో మభ్యపెట్టి బంగారం దోచుకెళ్లిన ఘటనలు ఉన్నాయి. ఇంకా కొన్నిచోట్ల నకిలీ పోలీసులు, జులాయిలు శివారు గ్రామాల రహస్య ప్రదేశాలలో మద్యం తాగుతూ ప్రేమ జంటల కోసం కాచుకుని కూర్చుంటారు. ప్రేమజంటలు, కళాశాల విద్యార్థులు అటువైపు రాగానే తొలుత యువకుడి వద్ద నుంచి బైక్ తాళాన్ని లాక్కుంటారు. ఐడీ కార్డును తీసుకుని వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లలో వారి ఫొటోలు, వీడియోలు చిత్రీకరిస్తారు. తల్లి దండ్రుల ఫోన్ నెంబర్లు ఇవ్వాలని బెదిరిస్తారు. ఆ తర్వాత తాము పోలీసులమని, స్టేషన్‌కు తీసుకెళతామంటూ భయభ్రాంతులకు గురిచేయడంతో ఏటీఎంల నుంచి డబ్బులు డ్రా చేసి మరీ ఇచ్చిన జంటలున్నట్టు సమాచారం.

గతంలో కేయూ, హసన్‌పర్తి, ధర్మసాగర్, మిల్స్‌కాలనీ పీఎస్‌ల పరిధిలో ప్రేమజంటలను చితకబాది దోపిడీ చేసి జైలుకు వెళ్లిన ఘటనలున్నాయి. అదే విధంగా పెద్దమ్మగడ్డ, రంగశాయిపేటకు చెందిన కొందరు యువకులు ఇదే తరహా దారి దోపిడీలకు పాల్పడి జైలుకు వెళ్లారు. ఆత్మకూరు మండలానికి చెందిన మరో యువకుడు ఒగ్లాపూర్‌సైలానీబాలా సమీపంలో మహిళలను, ప్రేమ జంటలను అడ్డగించి పోలీసులమని అటకాయించి బైకులు, డబ్బులు, బంగారు ఆభరణాలు, విలువైన సెల్‌ఫోన్లు లాక్కుని పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. అలాగే ఇలాంటి ఘటనలు ఎక్కువగా కేసీ కెనాల్ ప్రాంతం, కొత్తపేట, దామెర, ఓగ్లాపూర్, అనంతసాగర్, బొల్లికుంట, వంగపహాడ్, గొర్రెకుంట, ఆటోనగర్, శివనగర్, జక్కలొద్ది, కొండపర్తి, సింగారం, గవిచర్ల, కడిపికొండ, ప్రకాశ్‌రెడ్డిపేట, మడికొండ, ఉనికిచెర్ల, భీమారం, చింతగట్టు, కోమటిపల్లి, పలివెల్పుల, పెగడపెల్లి, రెడ్డిపురం గ్రామ శివార్లలో జరుగుతున్నట్టు సమాచారం. తాజాగా నగరానికి అనుకుని ఉన్న వంగపహాడ్ గ్రామంలో వ్యభిచార గృహాలకు వచ్చిన విటుల నుంచి నగదు, బంగారం, వాహనాలను దోపిడీ చేసిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని జైలుకు తరలించారు.

బ్లాక్‌మెయిల్

హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామంలో కొన్నేళ్లుగా కొన్ని కుటుంబాలు పడుపు వృత్తిని నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్నాయి. వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు అదే గ్రామానికి చెందిన యువకులు, ఇతర ప్రాంతాలకు చెందిన వారు రాత్రి సమయాల్లో వ్యభిచార గృహాల వద్దకు వచ్చే వారిని అడ్డుకుని హల్‌చల్ చేస్తున్నారు. విటుల ఫొటోలు, వీడియోలు తీస్తూ బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు, బంగారం లాక్కుంటున్నారని ఆవేదన చెందారు. కొందరిపై భౌతికదాడులు చేస్తూ డబ్బుల కోసం హింసిస్తున్నట్టు తెలిసింది. ఇటీవల ఓ మహిళపై అత్యాచారానికి పాల్పడగా, ముగ్గురిపై కేసులు నమోదయ్యాయి.

పట్టించుకోని పోలీసులు

నగర శివారు ప్రాంతాల్లో చాలాచోట్ల చిల్లర గ్యాంగులు నకిలీ పోలీసులుగా చెలామణి అవుతూ దొంగతనాలు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నా పోలీసులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫ్రెండ్లీ పోలీసులని నమ్మకంతో కొందరు బాధితులు, విద్యార్థులు ఫిర్యాదు చేస్తే యేడాది దాటుతున్నా కేసులు నమోదు చేయడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా నిత్యం పెట్రోలింగ్ నిర్వహించాల్సిన పోలీసులు.. విస్మరించడంతోపాటు లంపెన్ గ్యాంగులకు సహకరిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. వంగపహాడ్, సిద్ధాపూర్, గీసుగొండ, హసన్‌పర్తి, చలపర్తి, ల్యాదెళ్ల గ్రామాలను అనుకుని ఉన్న కొన్ని వ్యభిచార గృహాల నిర్వాహకులకు నకిలీలు, లంపెన్ గ్యాంగుల నుంచి దోపిడీకి గురికాక తప్పడం లేదని వాపోతున్నారు.

పోలీస్ బాస్‌లు శ్రద్ధ కనబర్చాలి

పోలీసు బాస్ అంబర్ కిశోర్ ఝా నగర శివార్లలో కలకలం రేపే నకిలీ పోలీసులు, చిల్లర గ్యాంగులపై దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కమిషనరేట్‌లో పోలీసు నిఘా వ్యవస్థ నిద్రమత్తులో ఉండడం, టాస్క్‌ఫోర్స్ టీమ్స్ అప్రమత్తంగా లేకపోవడం, పోలీసు పెట్రోలింగ్ బందాలు గస్తీ నిర్వహించకపోవడం వల్లనే కొందరు ఆకతాయిలు నకిలీ పోలీసుల అవతారం ఎత్తి శివార్లలో రెచ్చిపోతున్నారని అంటున్నారు. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని, ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి నకిలీలను ఏరివేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. సీపీ అంబర్ కిశోర్ ఝా నకిలీలపై దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



మళ్లీ 'పైరవీ' బదిలీలు

హాట్ టాపిక్‌గా మారిన 'చెక్ స్లిప్ ట్రాన్స్‌ఫర్స్' ● ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పదుల సంఖ్యలో సిఫారసులు

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 4: మళ్లీ చెక్ స్లిప్(పైరవీ) బదిలీలు తెరపైకి వస్తున్నాయి. పైరవీల బదిలీల కోసం అనారోగ్య సమస్యలంటూ కొంతమంది ఉపాధ్యాయులు అంతర్ జిల్లా బదిలీల కోసం పైరవీలు షురూ చేస్తున్నారు. గత ఏడాది ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ కంటే ముందుగానే కొంతమంది ఉపాధ్యాయులు చెక్ స్లిప్ బదిలీలతో ఇతర జిల్లాలకు వెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీగానే పైరవీల బదిలీలు జరగగా, ఉమ్మడి జిల్లాలో ఆరుగురు ఉపాధ్యాయులు ఈ నేపథ్యంలోనే బదిలీ అయ్యారు. అప్పుడది విద్యాశాఖలో పెద్ద దుమారం లేపడంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చెక్ స్లిప్ బదిలీలకు చెక్ పెట్టింది. ఇప్పుడు మళ్లీ కొత్తగా పాలకవర్గ నేతలు సిఫారసులు చేస్తుండటంతో విద్యాశాఖలో బదిలీల పరంపరకు తెరతీస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ (డీఎస్ఈ) కార్యాలయం నుంచి డీఈవోలకు కొంత మంది ఉపాధ్యాయుల బదిలీల కోసం రిమార్కులు అడుగుతున్నట్లు సమాచారం.

చెక్ స్లిప్ బదిలీలన్నీ అక్రమ బదిలీలే..

చెక్ స్లిప్ పేర్లతో వస్తున్న బదిలీలన్నీ అక్రమ బదిలీలే అంటూ ఉపాధ్యాయ వర్గాలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాలకవర్గాలను ప్రసన్నం చేసుకుంటూ కొంతమంది ఉపాధ్యాయులు అక్రమబదిలీలు చేయించుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనారోగ్య కారణాల పేరుతో అధికారులను బురిడీ కొట్టిస్తూ రిమోట్ ఏరియాల నుంచి పట్టణ ప్రాంతాలకు వచ్చేందుకు కొంతమంది ఉపాధ్యాయులు పావులు కదుపుతున్నట్లు ఉపాధ్యాయ వర్గాల్లో విమర్శలు వస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లోని హెచ్ఆర్ఏ సౌకర్యం ఉన్న పాఠశాలలనే ఎంపిక చేసుకుంటూ పైరవీ బదిలీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. నిజంగా అనారోగ్య కారణలుంటే సాధారణ బదిలీల్లో వారికి ప్రిఫరెన్షియల్ కేటగిరీల్లో పాయింట్లు వస్తాయని, అప్పుడు వారు పట్టణ ప్రాంతాల్లోకే బదిలీలు అవుతారని, అలా కాకుండా అనారోగ్య కారణాలు చూపుతూ లక్షల రూపాయలు లంచాలు అందజేస్తూ అక్రమ బదిలీలు చేయించుకుంటున్నట్లు ఉపాధ్యాయ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

సిఫారసుల్లో హుకుం

సాధారణంగా ప్రజాప్రతినిధులు ఎవరికైనా ఉద్యోగికి సిఫారసు చేస్తే సందర్భాన్ని బట్టి తాము సిఫారసు చేసిన పనులు చేయాల్సిందిగా అధికారులను ప్రజాప్రతినిధులు కోరుతారు. అయితే ఉపాధ్యాయుల పైరవీ బదిలీలకు సిఫారసులు చేస్తున్న ప్రజాప్రతినిధులు మాత్రం పని తప్పకుండా చేయాలంటూ సిఫారసు లేఖల్లోనే హుకుం జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. పాలకవర్గ ప్రజాప్రతినిధుల నుంచి హుకుంతో కూడిన సిఫారసు లేఖలు అందుతుండడంతో అధికారులు సైతం ఆందోళనకు గురవుతున్నట్లు తెలుస్తోంది. కొంత మంది ఉన్నతాధికారులు సైతం హుకుంతో కూడిన సిఫారసు లేఖలతో ఒత్తిడికి గురవుతున్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లా నుంచి పలువురి సిఫారసు?

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సుమారు 10 మంది ఉపాధ్యాయులకు పైగా సిఫారసు లేఖలతో హైదరాబాద్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. ముందుగానే సిఫారసు లేఖలు సమర్పించిన కొంత మంది ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన ఫైళ్లు సంబంధిత డీఈవోలకు వివరణ కోసం పంపించినట్లు సమాచారం. ఖాళీల వివరాలతోపాటు, సంబంధిత ఉపాధ్యాయులు కోరుకుంటున్న పాఠశాలల్లో ఖాళీల వివరాలు సమర్పించి సమగ్ర సమాచారం అందజేయాలని డీఈవోలకు సంబంధిత ఉన్నతాధికారి లేఖలు పంపించినట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లా నుంచి హనుమకొండ జిల్లాకు ఒకరు, ములుగు జిల్లా నుంచి వరంగల్ జిల్లాకు ఒకరు, మహబూబాబాద్ జిల్లా నుంచి జనగామ జిల్లాకు ఒకరు, ఆసిఫాబాద్ జిల్లా నుంచి వరంగల్ జిల్లాకు బదిలీ కోసం దరఖాస్తులు చేసుకున్న ఉపాధ్యాయులకు సంబంధించిన ఫైళ్లు ఆయా జిల్లాల డీఈవోలకు చేరుకున్నట్లు ఉపాధ్యాయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

డిప్యూటేషన్ల కోసం యత్నాలు

గ్రేటర్ హైదరాబాద్‌లో ఈనెల 2న డిప్యూటేషన్ల బదిలీల ఉత్తర్వులు జారీ కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొంత మంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్ బదిలీల కోసం పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది వరంగల్ జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ సర్దుబాట్లు జరిగిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది సైతం ఈ జిల్లా నుంచి జోరుగానే అక్రమ డిప్యూటేషన్లకు తెరతీసేందుకు ఇక్కడి అధికారులు సైతం సిద్ధం అవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఒక ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ అక్రమ డిప్యూటేషన్ బదిలీల కోసం కొంత మంది ఉపాధ్యాయులు అధికారులను, మరికొంత మంది ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

అక్రమ బదిలీలపై సీఎం దృష్టిపెట్టాలి

చెక్ స్లిప్ పేర్లతో ప్రజాప్రతినిధుల సిఫారసులతో అధికారులు చేపడుతున్న అక్రమ బదిలీలపై ముఖ్యమంత్రి చొరవ తీసుకొని అక్రమ బదిలీలను నిరోధిస్తూ చర్యలు తీసుకోవాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలతో పాటు విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే అక్రమార్కులకు కొమ్ముకాస్తూ సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు అన్యాయం జరిగే అక్రమ బదిలీలను వెంటనే రద్దు చేయాలంటూ కోరుతున్నారు. సాధారణ బదిలీలు చేపట్టేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. పర్యవేక్షణాధికారుల కొరత, ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్న విద్యారంగాన్ని గాడిన పెట్టాలని కోరుతున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



నల్లా భాస్కర్‌రెడ్డి మృతదేహం

నయీంనగర్, ఫిబ్రవరి 4: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నక్కలగుట్ట వద్ద గల హరిత కాకతీయ హోటల్‌లో నల్లా భాస్కర్‌రెడ్డి(35) అనే వ్యక్తి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. సుబేదారి ఎస్ఐ సుమన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ ఎక్సైజ్ కాలనీకి చెందిన నల్లా భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి ఓ ప్రయివేటు చిట్‌ఫండ్స్ కంపెనీలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పని చేసేవాడు. భాస్కర్‌రెడ్డి చిట్‌ఫండ్స్‌లో చాలా మంది ఖాతాదారులతో దాదాపు రూ.5 కోట్ల వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించినట్లు ఎస్ఐ తెలిపారు. చిట్‌ఫండ్స్ యజమానులు ఖాతాదారులకు వారి డబ్బు ఇవ్వకపోవటంతో ఖాతాదారులు భాస్కర్‌రెడ్డిపై ఒత్తిడి చేసేవారు. అలాగే ఆరు నెలలుగా చిట్‌ఫండ్ కంపెనీ వారు జీతాలు ఇవ్వడం లేదు. దీంతో భాస్కర్‌రెడ్డి చాలా రోజుల నుంచి ఒత్తిడికి లోనై తీవ్ర మనస్తాపానికి గురయ్యేవాడని తన భార్య శామిలి తెలిపినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈ క్రమంలో శుక్రవారం భాస్కర్‌రెడ్డి తన భార్యకు బయటికి వెళ్తొస్తానని చెప్పి వెళ్లాడని, అప్పటి నుంచి ఫోన్ కాల్ లిఫ్ట్ చేయకపోవడంతో తన భార్య భాస్కర్‌రెడ్డి స్నేహితులకు ఫోన్ చేసి చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు. భాస్కర్‌రెడ్డి ఆచూకీ కోసం అతడి స్నేహితులు అన్ని ప్రాంతాలు వెతకగా మృతుడి కారు హరిత కాకతీయ హోటల్‌లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే హోటల్ సిబ్బందిని విచారించగా రెండు రోజుల నుంచి హోటల్‌లో ఉంటున్నట్లు సిబ్బంది తెలిపినట్లు వారి స్నేహితులు తెలిపారు. హోటల్ గదికి వెళ్లగా లోపలి నుంచి గడియ పెట్టుకుని ఉందని, హోటల్ సిబ్బంది గది తలుపులు తెరిచి చూడగా భాస్కర్‌రెడ్డి గదిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సుబేదారి ఎస్ఐ సుమన్ తెలిపారు. మృతుడు భాస్కర్‌రెడ్డికి భార్య శామిలి, ఇద్దరు కుమారులు మణికంఠరెడ్డి, విద్యావన్‌రెడ్డి ఉన్నారు. మృతుడి భార్య శామిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సుబేదారి సీఐ మహ్మద్ అబ్దుల్ షూకూర్ తెలిపారు.

తెలుగులో పద్మకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 4: కేయూ తెలుగు విభాగం పరిశోధకురాలు జక్కం పద్మ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు శనివారం పద్మకు డాక్టరేట్ ప్రకటించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ప్రకటించారు. తిక్కన మహాభారతం -మౌసల నుంచి స్వర్గారోహణ పర్వాములు- విమర్శనాత్మక పరిశీలన ' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకుగాను డాక్టరేట్ లభించింది. తెలుగు యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్స్‌లర్, కేయూ ఆర్ట్స్ తెలుగు మాజీ డీన్, రిటైర్డు ప్రొఫెసర్ కొంకా యాదగిరి పర్యవేక్షణలో పద్మపరిశోధన గ్రంథాన్ని రూపొందించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం తనుగులకు చెందిన పద్మ నల్లగొండలోని టీఎస్‌టీడబ్ల్యూఆర్‌డీసీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. డాక్టరేట్ సాధించిన పద్మను పలువురు అభినందించారు.

నవోదయలో ఖాళీల భర్తీకి సన్నాహాలు

● 9, 11వ తరగతిలో ప్రవేశాలకు 2,980 దరఖాస్తులు

● ఈనెల 10న ప్రవేశ పరీక్ష : ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ



జఫర్‌గడ్, ఫిబ్రవరి 4: జవహర్ నవోదయలో ఖాళీ సీట్ల భర్తీకి అధికారులు సన్నాహాలు చేపట్టారు. 2024-25 విద్యా సంవత్సరానికి మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,980 దరఖాస్తులు రాగా, ఇందులో 9వ తరగతికి 1,480, 11వ తరగతికి 1,500 చొప్పున వచ్చాయన్నారు. ప్రవేశ పరీక్ష నిర్వహణకు 9వ తరగతి అభ్యర్థులకు వరంగల్‌లో నాలుగు, మామునూరులోని నవోదయ విద్యాలయంలో ఒకటి చొప్పున 5 పరీక్షా కేంద్రాలు, 11వ తరగతి అభ్యర్థులకు వరంగల్‌లో 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రవేశ పరీక్ష ఆయా కేంద్రాల్లో ఉదయం 11-30 నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకునిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డుల (హాల్ టికెట్లు)ను నవోదయ వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అయితే సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న సమయంలో పొందుపరిచిన వివరాలకు.. అడ్మిట్ కార్డుల్లో గల వివరాలకు ఏదేని తేడా కనిపిస్తే, ఇందుకు తగిన ధ్రువపత్రాలతో ఈనెల 7వ తేదీ వరకు మామునూరులోని నవోదయ విద్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంప్రదించాలని అభ్యర్థులకు సూచించారు.

భక్తజన సందోహం

● వనదేవతల సన్నిధిలో కిక్కిరిసిన జనం ● కిటకిటలాడిన గద్దె ప్రాంగణం

మేడారం, ఫిబ్రవరి 4: తాడ్వాయి మండలం మేడారంలో కొలువైన సమ్మక్క - సారలమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు ప్రవాహంలా తరలివచ్చారు. సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంతా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈనెల 21 నంచి 24 వరకు మహాజాతర జరగనుండగా ఆ సమయంలో కోటిన్నర మందికి పైగా భక్తులు తరలి వచ్చి మొక్కులు సమర్పించుకుంటారు. ఈ నేపథ్యంలో అధిక మంది భక్తులు ముందస్తుగా మొక్కులు చెల్లించుకుంటున్నారు. తిరిగి మహా జాతరలో తల్లులకు ఎదురు మొక్కులు సమర్పించుకుంటామని అంటున్నారు.

ప్రముఖుల ప్రత్యేక పూజలు

మేడారం వనదేవతలను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉమ్మడి ఐటీ కమిషనర్ బాలకృష్ణ, ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, హైకోర్టు న్యాయమూర్తి చంద్రశేఖర్, ఉట్నూరు రెవెన్యూ డివిజన్ అధికారి జివాకర్‌రెడ్డి వేర్వేరుగా మొక్కులు చెల్లించుకున్నారు.

కట్టుదిట్టంగా ట్రాఫిక్ నియంత్రణ

మహాజాతరకు ముందుగా మొక్కులు చెల్లించుకోవడానికి వచ్చిన భక్తుల వాహనాలతో మేడారం కిక్కిరిసిపోయింది. హరితహోటల్, చిలకలగుట్ట, శివరాంసాగర్, ఆర్టీసీ బస్టాండ్, జంపన్నవాగు, వీవీఐపీ పార్కింగ్ పరిసరాల్లో భక్తులు విడిది చేయడంతో వేల సంఖ్యలో వాహనాలు చేరుకున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. వాహనాలను రూట్ మొబైల్ పార్టీలు రోడ్డుపై నిమిషం ఆగకుండా పార్కింగ్‌లకు తరలించాయి. భక్తులు సులువుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి, గద్దెల సమీపానికి చేరుకునేలా ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల నుంచి తరలివచ్చిన సుమారు వెయ్యి మంది పోలీసులు సేవలు అందించారు. భక్తుల భద్రత, వీవీఐపీ, వీఐపీ దర్శనాలతో పాటు క్యూలైన్ల వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు.



జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ఆర్టీసీ సేవలు

భక్తులను మేడారం చేర్చడానికి వివిధ జిల్లాల ఆర్టీసీ డిపో సర్వీసులను అధికారులు వినియోగించారు. హనుమకొండ నుంచి మేడారం వరకు 67ట్రిప్‌లు, తిరిగి హనుమకొండకు 67 ట్రిప్‌లు నడిపినట్లు 52 సర్వీసులతో 5800 మందికి రవాణా సౌకర్యాలు కల్పించినట్లు ఆర్టీసీ ప్రత్యేక పర్యవేక్షణాధికారి శివప్రసాద్ తెలిపారు. మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకున్నారని అన్నారు.




వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



గద్దెల ప్రాంగణంలో గంట కొడుతున్న భక్తులు

భారత రాజ్యాంగంలో మార్పు రావాలి..

సీబీఐ మాజీ డైరెక్టర్ మన్నెం నాగేశ్వర్ రావు



మాట్లాడుతున్న నాగేశ్వర్ రావు

హనుమకొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంలో మౌలికమైన కొన్ని మార్పులు రావలసిన అవసరం ఉందని సీబీఐ మాజీ డైరెక్టర్ మన్నెం నాగేశ్వర్ రావు అభిప్రాయపడ్డారు. ఆదివారం హనుమకొండ లష్కర్‌బజార్ హైస్కూల్‌లో 'శ్రీ శారదా కృష్ణ సాహితీ సామాజిక సాంకేతిక ట్రస్ట్ భారత రాజ్యాంగం, సాంస్కృతిక వికాసం, పరిపాలనా ధోరణలు' అనే అంశంపై ప్రసంగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వర్‌రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం అల్ప సంఖ్యాక వర్గాలకు కల్పిస్తున్న రక్షణలు అధిక సంఖ్యాక వర్గాలకు కల్పించలేదన్నారు. అందువల్ల దేశంలో హిందూ మతం నానాటికీ పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, పర్యవసానంగా మత మార్పిడులు మరింతగా పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఈ పరిస్థితి రాకుండా రాజ్యాంగ రక్షణలు ఉండాలన్నారు. రాజాశ్రయం లేకుండా మతాలు మనుగడ సాగించలేవని, ప్రపంచంలో ఇతర పెద్ద మతాలను తమ అధికారిక మతాలుగా దేశాలు ప్రకటించడంవల్ల అవి విస్తృతమౌతున్నాయని, కానీ హిందూ మతానికి అలాంటి అవకాశం లేదన్నారు. కనుక భారత రాజ్యాంగం చట్టపరమైన సరైన రక్షణలు కల్పించాలని నాగేశ్వర్‌రావు కోరారు.

ఈ సందర్భంగా ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాసర్ల రంగారావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ప్రముఖ అష్టావధాని చేపూరి శ్రీరాం కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజా మనోహర్ బాబు, ఎన్‌వీఎన్ చారి, వరికొండ కాంతారావు, పాలకుర్తి దినకర్, పల్లేరు వీరస్వామి, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అమరవాది రాఘవ, క్రిష్ణారావు, పరమేశ్వర్ రాజు, అడ్లూరి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవి, భవ్యల మృతి దిగ్భ్రాంతికరం

విద్యార్థినుల కుటుంబాలకు అండగా ఉంటాం.. : మహిళా కాంగ్రెస్ రాష్ట అధ్యక్షురాలు సునితారావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 4: యాదాద్రి భువనగిరి జిల్లా గురుకుల విద్యార్థినులు వైష్ణవి, భవ్యలు ఆత్మహత్యకు గురి కావడం దిగ్భ్రాంతికి గురి చేసిందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు అన్నారు. విద్యార్థుల మృతికి మహిళా కాంగ్రెస్ సంతాపం ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం వరంగల్ పార్లమెంట్ మహిళా కాంగ్రెస్ సమీక్ష సమావేశం హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాయాదవ్ అధ్యక్షతన హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథులుగా సునితారావుతో పాటు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొన్నారు. సమీక్ష సమావేశం అనంతరం మీడియా సమావేశంలో సునితారావు మాట్లాడారు.

గురుకుల పాఠశాల ఘటనపై విచారణ జరుగుతున్నట్లు పేర్కొన్నారు. పోలీస్‌అధికారులతో కూడా మాట్లాడినట్లు చెప్పారు. విద్యార్థినులు తొందరపాటు నిర్ణయాలకు గురి కావొద్దని సూచించారు. సమస్యలను ఎదురించాలి తప్ప.. ఆత్మహత్యలు పరిష్కారమే కాదన్నారు. జరిగిన సంఘటనతో తీవ్ర వేదనకు గురైనట్లు చెప్పారు. వైష్ణవి, భవ్య కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. విద్యార్థినులు ఆత్మహత్యకు గురి కావడం విచారకరమన్నారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాయాదవ్ మాట్లాడుతూ.. ఆత్మహత్యే పరిష్కారం అనుకుంటే ఎవరూ ఉండరన్నారు. ప్రతి మహిళా సమస్యలకు దీటుగా పోరాడాలని సూచించారు. ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు పార్వతమ్మ, జనగామ జిల్లా అధ్యక్షురాలు ఇందిర, జయశంకర్ భూపాలపల్లి అధ్యక్షురాలు శ్రీదేవితో పాటు స్వప్న, సుగుణ, స్రవంతి తదితరలు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL CITY 8

వరంగల్ సిటీ

● వరంగల్ ● ఖిలావరంగల్ ● గీసుగొండ ● సంగెం

సోమవారం 5 ఫిబ్రవరి 2024

పాఠశాల విద్యార్థులకు పోటీలు

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 4: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు శివాజీ మహారాజ్ యువసేన వరంగల్ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ ప్రణవ్ వెల్లడించారు. ఆదివారం కాశిబుగ్గలోని వివేకానంద విద్యా కేంద్రంలో పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ... వ్యాసరచన, చిత్రలేఖనం, కబడ్డీ తదితర పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు రూ.20 ఎంట్రీ రుసుము చెల్లించి పోటీల్లో పాల్గొనవచ్చు నన్నారు. వివరాలకు 81067 17621/97010 97143లో సంప్రదించాలని కోరారు.



పోటీల వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు



మత్తు.. చిత్తు !

- గంజాయికి బానిసవుతున్న యువత
- నగర శివారుల్లో విచ్చలవిడిగా లభ్యం
- వివిధ రూపాల్లో దొరుకుతున్న గంజాయి
- తనిఖీలు మరిచిన పోలీసులు
- రైళ్లలో యథేచ్ఛగా సరఫరా
- గ్రామాలకూ పాకిన విష సంస్కృతి

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 4: వరంగల్‌లో గంజాయి మత్తులో యువత చిత్తవుతోంది. గంజాయికి అలవాటు పడుతున్న యువత ఆకతాయిలుగా, పోకిరీలుగా మారుతున్నారు. బహిరంగ మార్కెట్లో గంజాయి వివిధ రకాల్లో లభ్యమవుతుండటంతో యువత గంజాయి మత్తు కోసం ఉవ్విళ్లూరుతున్నారు. ముఖ్యంగా ఇంటర్మీడియెట్, డిగ్రీతోపాటు ఇంజనీరింగ్ చదువుతున్న కొంతమంది విద్యార్థులు గంజాయి సిగరెట్ల కోసం వెంపర్లాడుతున్నారు. నగర శివారుల్లో గంజాయితో కూడిన సిగరెట్లు విచ్చలవిడిగా లభ్యమవుతుండటం, ఎలాంటి తనిఖీలు లేకపోవడంతో చిన్న చిన్న పాన్ షాపుల్లో సైతం గంజాయి సిగరెట్లు లభ్యమవుతున్నాయి. దీంతో వయసుతో తేడా లేకుండా యువత గంజాయి సేవిస్తూ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఈ విష సంస్కృతి గ్రామీణ ప్రాంతాలకు సైతం పాకిందంటే అతిశయోక్తి కాదు. వివిధ కళాశాలల్లో చదువుతున్న కొంత మంది విద్యార్థులు ఇక్కడ నుంచి గంజాయి సిగరెట్లు కొనుగోలు చేసి వారి వారి ఊర్లకు తీసుకెళుతున్నారు. అక్కడ సాయంత్రం పూట కనుమసక అయిన తర్వాత గంజాయి గ్రామీణ ప్రాంతాల్లో సైతం గుప్పుమంటోంది. రైళ్లలో గంజాయి రవాణా నిరంతరంగా కొనసాగుతుండటం పోలీసుల నిఘా కొరవడటం తో వరంగల్ నగరంలో గంజాయి వ్యాపారం విచ్చల విడిగా కొనసాగుతోంది.

● నగరాన్ని ఆవహిస్తున్న గంజాయి..

నగరంలో గంజాయి మత్తు ఆవహిస్తోంది. రోజు రోజుకూ గంజాయి విక్రయాలు పెరిగిపోతున్నాయి. గంజాయి సిగరెట్లు విచ్చలవిడిగా లభ్యమవు తున్నాయి. వీటితోపాటు ప్రత్యామ్నాయ మత్తు పదార్థాలు లభ్యమవుతుండటంతో వాటిని వినియోగిస్తున్న ఆకతాయిల ఆగడాలు ఎక్కువవుతున్నాయి. గతంలో నగర శివారు ప్రాంతాలకే పరిమితమైన గంజాయి అమ్మకాలు ఇప్పుడు నగరం నడిబొడ్డుకు పాకింది. గంజాయి మత్తులో కొందరు యువకులు హల్ చల్ చేస్తుంటే మద్యానికి బానిసైన మరికొంత మంది ఆకతాయిలుగా మారి రోడ్లపై వికృత చేష్టలు చేస్తున్నారు. ర్యాష్ డ్రైవింగ్, రోడ్ల వెంట వెళ్లే వారితో అసభ్యంగా ప్రవర్తించడం, బెదిరించడం, వెంటబడు తూ బూతులు తిట్టడం లాంటి సంఘటనలు నగరంలో నిత్యకృత్యమయ్యాయి.

● విచ్చలవిడిగా విక్రయాలు...

నగరంలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి. నగర శివారు ప్రాంతాలతో పాటు రద్దీ ప్రాంతాల్లోనూ గంజాయి దొరుకుతోంది. గంజాయికి ప్రత్యామ్నాయంగా మత్తుకు బానిసలైన కొంత మంది యువకులు వైట్‌నర్‌ను వాసన చూస్తూ, దగ్గు మందు సీసాలకు ఖాళీ చేస్తూ మత్తులోకి తూలుతున్నారు. శివనగర్, రంగశాయిపేట, ఉర్సుగుట్ట, ఎల్‌బీ నగర్, గిరిప్రసాద్‌నగర్, ఏనుమాముల ప్రాంతంలోని ఎన్‌టీఆర్ నగర్, చిన్నవడ్డేపల్లి, చింతల్, ఎల్‌బీనగర్, ధర్మారం, నాయుడు పెట్రోల్‌పంపు తదితర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు కొనసాగుతున్నట్లు సమాచారం.

● పెట్రోలింగ్ మరిచిన పోలీసులు...

పెట్రోలింగ్ చేస్తూ ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టాల్సిన పోలీసులు పెట్రోలింగ్‌ను పూర్తిగా విస్మరించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోకిరీల అడ్డాలను గుర్తించడంలోనూ విఫలం అవుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటర్ సెప్టర్ వాహనాలు కాలక్షేపానికే పనిచేస్తున్నట్లు విమర్శలున్నాయి. గంజాయి విక్రయించే వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు అందులో పూర్తిగా విఫలమయ్యారు. గంజాయి రవాణా అవుతున్న రైళ్లలో గస్తీని ఏర్పాటు చేసి గంజాయి అక్రమ రవాణాను అరికట్టాల్సిన వారు వైఫల్యం చెందుతున్నట్లు తెలుస్తోంది. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ప్రతీ రోజు కిలోల లెక్కన విక్రయాలు జరుగుతున్న అక్రమార్కులను గుర్తించడంతో పూర్తి స్థాయిలో పోలీసులు విఫలమవుతున్నారు. అప్పుడప్పుడు విశ్వసనీయ సమాచారంతో మాత్రమే పోలీసులు దాడులు చేసి గంజాయిని పట్టుకుంటున్నారు.

● ఇటీవల నగరంలో జరిగిన సంఘటనలు...

- ఖిలావరంగల్ కోట ప్రాంతంలో గంజాయి మత్తులో ముగ్గురు యువకులు హల్‌చల్ చేశారు. ద్విచక్ర వాహనంపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ అరుపులు, కేకలు వేస్తు మరో యువకుడిపై దాడికి దిగారు. రెండు గంటలకు పైగా అక్కడ సదరు యువకులు అక్కడ వీరంగం సృష్టించారు.

● గోపాలస్వామి గుడి సమీపంలోని వేణురావు కాలనీలోని ఓ వ్యాపారి తన కూతురుతో దురుసుగా ప్రవరిస్తున్నాడని ఓ యువకుడిని మందలించాడు. అందుకు ఆ యువకుడు తన స్నేహితులతో కలిసి సదరు వ్యాపారిపై రాళ్లతో దాడి చేయగా వ్యాపారి గాయపడ్డాడు.

● రంగశాయిపేట, శంభునిపేట తదితర రద్దీ ప్రాంతాల్లో సాయంత్రం పూట ఆకతాయిల ఆగడాలు మితిమీరుతున్నాయి.

● మండిబజార్‌లోని ఓ బిర్యాని హోటల్‌లో ముగ్గురు వ్యక్తులు హల్ చల్ చేశారు. అంతకు ముందు ఇదే బ్యాచ్ గోపాలస్వామి గుడి ప్రాంతంలోని ఓ బేకరీలోను ఇదే తంతును కొనసాగించారు.

● పోచమ్మమైదాన్ సెంటర్‌లోని ఓ ఇడ్లీ బండి వద్ద కొంత మంది ఆకతాయిలు గొడవకు దిగారు.

● శివనగరలో ఇద్దరు వ్యక్తులు మద్యం, గంజాయి మత్తులో బాహాబాహికి దిగారు.

● గవిచర్ల క్రాస్ రోడ్‌లోని ఓ వైన్ షాప్‌లో ఆకతాయి మద్యం మత్తులో మరో వ్యక్తిపై బీరుసీసాతో దాడి చేశాడు. - ఎంజీఎంలో విధులు పూర్తి చేసుకొని రాత్రి ఇంటికి వెళుతున్న ఓ డాక్టర్‌ను ఖిలా వరంగ్ ఈద్గా వద్ద అటకాయించిన ఆకతాయిలు డాక్టర్‌ను కొంత సేపు ఇబ్బందులకు గురి చేశారు.



గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)

ఒడిస్సా, వైజాగ్ నుంచి సరఫరా...

వరంగల్ నగరానికి ఒడిస్సా రాష్ట్రం, పక్క తెలుగు రాష్ట్రంలోని విశాఖపట్టణం నుంచి పెద్ద ఎత్తున గంజాయి అక్రమంగా చేరవేస్తున్నట్లు తెలుస్తుంది. గంజాయి అక్రమ రవాణాకు సులువుగా రైలు మార్గాన్ని గంజాయి విక్రయ దారులు ఎంచుకున్నట్లు తెలుస్తుంది. ప్రయాణి కుల్లా వస్తూ బ్యాగుల్లో ఎండు గంజాయిని నింపుకొస్తూ ఇక్కడ టోకుగా విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. నగరంతో పాటు కరీంనగర్, ఆదిలా బాద్, ఖమ్మం, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఇక్కడ నుంచే గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది.

బీసీ సంక్షేమ సంఘం అర్బన్ ప్రధాన కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్



వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 4: బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ వరంగల్ అర్బన్ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్‌ను నియమిస్తూ అధ్యక్షుడు అప్పరాజు రాజు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఐదు దశాబ్దాలుగా వెనకబడిన ప్రాంతంలో అట్టడుగు వర్గాల ప్రజలకు సేవలందిస్తున్న రాజేంద్రప్రసాద్ సేవలు బీసీ సంక్షేమ సంఘానికి తీసుకోవాలని నియమించినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, సలహాదారు తాళ్ల రవి, కార్యదర్శి వడ్లకొండ వేణుగోపాల్, బైరి రవికృష్ణ, అప్పరాజు రాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రి సురేఖకు వినతి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 4: వరంగల్ మహానగర పాలక సంస్థలో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ మునిసిపల్ కాంట్రా క్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ప్రతినిధులు మంత్రి కొండా సురేఖకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం హనుమకొండలోని మంత్రి నివాసంలో ఆమెను కలిసి విన్నవించారు. టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ ఆధ్వర్యంలో మంత్రి సురేఖను కలిసి తమ సమస్యలను తెలియచేశారు. ఉద్యోగ భద్రత కరువైందని, వేతనాలు పెంచాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్తకొండ శ్రీనివాస్, కొమ్ము తిలక్, కుమార్, ప్రసాద్, నరేశ్, దేవేందర్ పాల్గొన్నారు.

పట్నాలు వేసి.. మొక్కులు సమర్పించి..

● ఐనవోలులో వారాంతపు జాతర ● వేలాదిగా వచ్చిన భక్తులు



ఆలయ ప్రాంగణంలో నజర్‌పట్నాల్లో నిమగ్నమైన భక్తులు

ఐనవోలు, ఫిబ్రవరి 4: ఐనవోలు మల్లికార్జునస్వామి 3వ ఆదివారం వారాంతపు జాతరకు భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. ఆదివారం ఉదయం స్వామి వారికి మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు కల్యాణం నిర్వహించి రుద్రాభిషేకాలు జరిపారు. ఆయా జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో నజర్, చెలక పట్నాలు వేసి బోనం వండి అమ్మవార్లకు స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్క పట్నాల వద్ద పూర్వికులను స్తుతించారు. మొక్కుల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు భక్తులు ఒడి బియ్యం, వస్త్రాలు, ముత్తైదు సామాగ్రిని ముట్టచెప్పారు. మరి కొందరు రథసేవను నిర్వహించారు. రథంలో ఉత్సవవిగ్రహాలను పెట్టి ఆలయం చుట్టు లాగుతూ ప్రదిక్షణలు చేశారు.

బొడ్రాయి భూమిపూజకు మంత్రికి ఆహ్వానం



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిటీ సభ్యులు

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 4: కరీమాబాద్‌లోని నానామియాతోటలో బొడ్రాయి ప్రతిష్ఠాపన భూమి పూజకు దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను ప్రతిష్ఠాపన కమిటీ ఆహ్వానించారు. ఆదివారం హనుమకొండలోని మంత్రి నివాసంలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసిన కమిటీ సభ్యులు పుష్పగుచ్ఛం అందజేసి సురేఖ-మురళీధర్‌రావు దంపతులను ఈనెల 11న నానామియాతోటలో నిర్వహించే బొడ్రాయి ప్రతిష్ఠాపన భూమి పూజకు రావాల్సిందిగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కంకల మల్లేశం, చింతపట్ల వీరస్వామి, కొండిల్ల కనకయ్య, గోరంటల కిషన్, బెజ్జంకి కృష్ణ, దయ్యాల సుధాకర్, కంకల శంకర్, మేడిపెల్లి రాజు, దూడ బాలకొమిరెల్లి, కొమ్ము లింగమూర్తి, కనుకుంట్ల భరత్, చోటు, కోరె రమేష్, గూడూరు సదానందం, మాందాటి సందీప్, శెట్టి మోహన్, ఎక్కలదేవి పరమేశ్వర్, బెజ్జంకి కిషన్, వాసూరి శ్రీనివాస్, గొట్టె మల్లేష్, ఎలిగేటి భిక్షపతి, ప్రశాంత్, చింతపట్ల రాజు, కొండిల్ల రవీందర్, గౌడ తిరుపతి పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న శంకర్‌రావు

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 4: ఉద్యోగస్తుల పదోన్నతులు, గృహిణీల విద్యావసరాలు తీర్చేందుకు, వయసు పైబడిన వారికి చదువు అవకాశం కల్పించేందుకు తెలంగాణ ఓపెన్ స్కూల్ విధానాన్ని అందరూ వినియోగించుకోవాలని ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు అన్నారు. ఆదివారం కాశిబుగ్గలోని నరేంద్ర నగర్ ప్రభుత్వ పాఠశాల ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో ఇంటర్, ఎస్సెస్సీ తరగతుల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శంకర్‌రావు మాట్లాడారు. సెంటర్ కో ఆర్డినేటర్ అల్లి అజయ్‌బాబు, ట్యూటర్ డాక్టర్ రవిందర్, టి.కుమారస్వమి, దినేష్, అవినాష్ పాల్గొన్నారు.

భావసార్ క్షత్రియ సమాజ్ ఎన్నికలు



భావసార్ క్షత్రియ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

గిర్మాజిపేట, ఫిబ్రవరి 4 : భావసార్ క్షత్రియ సమాజ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్నికలు ఆదివారం వరంగల్ జిల్లా కేంద్రంలోని రాధిక టాకీసు గల్లీలోని భావసార్ భవన్‌లో జరిగాయి. అరండ్‌కర్ రవిందర్ పర్యవేక్షణలో జరిగిన ఎన్నికలలో అధ్యక్షుడిగా క్షీరసాగర్ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా ముదులాకర్ అనిల్, కోశాధికారిగా మాపేంద్రకర్ భాస్కర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా మాపేంద్రకర్ రాజేష్, క్షీరసాగర్ అమర్‌నాథ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డౌలఘర్ రమేష్, సహాయ కోశాధికారిగా గోజే కృష్ణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు క్షీరసాగర్ వేణుగోపాల్ మాట్లాడుతూ వరంగల్ జిల్లాలోని భావసార్ క్షత్రియ సమాజ్ సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా తమ కార్యవర్గం పనిచేస్తుందన్నారు. భావసార్ క్షత్రియ సమాజ్ పిల్లల విద్యకు ప్రోత్సాహం అందచేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గర్జే రాజేష్ కుమార్, డాక్టర్ డౌళగర్ సత్యనారాయణ, డాక్టర్ ఆనంద్ బోక్రే, ప్రకాష్, కిషన్, అరెండ్‌కర్ శ్యామ్‌ల భావసార్ క్షత్రియ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

కోటలో అలరించిన 2కే రన్

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన



కోటలో 2కే రన్‌లో పాల్గొన్న ప్రజలు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 4: క్యాన్సర్ బారినపడకుండా ఉండాలంటే ప్రతిరోజు మంచి ఆహారంతోపాటు గంటపాటు వ్యాయామం చేయాలని బీజేపీ వరంగల్ జిల్లా ఐటీ, సోషల్ మీడియా కన్వీనర్ ఆడెపు వెంకటేష్ అన్నారు. ఆదివారం ఖిలావరంగల్ మధ్యకోటలోని వాకింగ్ గ్రౌండ్ నుంచి ఖుష్‌మహల్ వరకు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఓవర్సీస్ కన్సల్టెన్సీ సీఈవో ఆడెపు మధుసూదన్ ఆధ్వర్యంలో 2కే రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి వెంకటేష్ మాట్లాడుతూ ప్రతిరోజు గంటపాటు ధ్యానం, యోగా, వ్యాయామం చేయాలన్నారు. వీలైనంతవరకు ప్లాస్టిక్ వస్తువు లను వాడకూడదన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 2కే రన్‌లో గెలుపొందినవారికి మెమొంటో, కప్‌లను బహూకరించారు. కార్యక్రమంలో ఖిలావరంగల్ వాకర్స్, డాక్టర్‌లు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలి

-రాష్ట్ర అధ్యక్షురాలు సునితారావు

(5వ పేజీ తరువాయి)

జరపాలని సునితారావు సూచించారు. గ్యారంటీల ద్వారా మహిళలకు కలిగే ప్రయోజనాలపై మరింత అవగాహన కల్పించా లన్నారు. ఎమ్మెల్సీ కవిత తన స్థాయిని మించి మా ట్లాడుతోందని సునితారావు విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, అధినేత్రి ప్రియాంకగాంధీ గురించి ఇష్టారీతిలో మాట్లాడడం అనైతికమన్నారు. సోని యాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందనేది కవిత మరి చిందని, ఆమెకు మతిభ్రమించిందని మండిపడ్డారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సహించేబోమని స్పష్టం చేశారు. మోదీ హయాంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. ప్రగల్భాలతోనే మోదీ ప్రజల ను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ పీఎం కావడం ఖాయమన్నారు.

మహిళా కాంగ్రెస్ పాత్ర కీలకం

లోక్‌సభ ఎన్నికల్లో మహిళా కాంగ్రెస్ పాత్ర కీలకమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీలతో పాటు కాంగ్రెస్ మేనిఫెస్టోను ఇంటింటికి తీసుకెళ్లి మహిళలకు వివరించాలన్నారు. ఇప్పటికే ప్రకటించిన రెండు గ్యారంటీలతో మహిళలు సంతోషంగా ఉన్నారని, త్వరలో మరో రెండు గ్యారంటీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించనున్న క్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు విస్తృత ప్రచారం జరపాలని సూచించారు. వరంగల్‌లోని రెండు లోక్‌సభ స్థానాల్లో పార్టీ విజయానికి అండగా నిలవాలన్నారు. సమష్టిగా కృషి చేద్దాంలోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం సమష్టిగా కృషి చేద్దామని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్య క్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పిలుపునిచ్చారు. ఈ సమా వేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు పార్వ తమ్మ, జనగామ జిల్లా అధ్యక్షురాలు ఇందిర, జయశంకర్ భూపాలపల్లి అధ్యక్షురాలు శ్రీదేవితో పాటు స్వప్న, సుగుణ, స్రవంతి, గ్రామ, మండల, నియోజ కవర్గ మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ఉర్సు



దర్గాలోని మాషూక్ రబ్బాని పవిత్ర సమాధి



విద్యుత్ దీపాల వెలుగుల్లో మాషూక్ రబ్బాని దర్గా

కరీమాబాద్, ఫిబ్రవరి 4: నగరంలోని ఉర్సు ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. హజ్రత్ సయ్యదాన మాషూక్ రబ్బాని దర్గా ఉత్సవాలకు ఆదివారం దర్గా పీఠాధిపతులు నవీద్‌బాబా, ఉబేద్‌బాబాల ఆధ్వర్యంలో దర్గాలోని పవిత్ర సమాధివద్ద ఖురాన్ పఠనంతో ఉత్సవాలకు ముగింపు పలికారు. దర్గాను దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నుంచి వేలాది మంది భక్తులు ఈ దార్గాను దర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు దర్గా పీఠాధిప తులు అన్ని రకాల ఏర్పాట్లు చేయడమే కాకుండా ఉత్సవాలు కొనసా గిన ఈ మూడు రోజులు వేలాది మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఉత్సవాలను విజయవంతం చేయడంలో సహకరించిన మంత్రి కొండా సురేఖకు, గ్రేటర్ వరంగల్ కమిషనర్ రిజ్వాన్‌బాషా, మేయర్ సుధారాణి, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ, ఏసీపీ బోనాల కిషన్, భక్తులకు, దర్గా పీఠాధిపతులు నవీద్‌బాబా, ఉబేద్‌బాబాలు ప్రత్యేక తెలిపారు.

పద్మకు డాక్టరేట్ ప్రదానం



వరంగల్ సిటీ, ఫిబ్రవరి 4: తెలుగు విభాగం పరిశోధకురాలు జక్కే పద్మకు కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. 'తిక్కన మహాభారతం- మౌసల నుంచి స్వర్గారోహణ పర్వం వరకు విమర్శనాత్మక పరిశీలన' అనే అంశంపై విశ్రాంతా చార్యులు కె.యాదగిరి పర్యవేక్షణలో పద్మ పీహెచ్‌డీ పూర్తి చేశారు. పద్మ ప్రస్తుతం నల్గొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

సంగెం, ఫిబ్రవరి 4: పల్లార్‌గూడ గ్రామశివారులో పోలీసులు గుడుంబా స్థావరాలపై ఆదివారం దాడులు నిర్వహించారు. గుడుంబా తయారు కోసం బెల్లంను భూమిలో పాతిపెట్టిన ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నానాబెట్టిన విష యం తెలుసుకుని దాడులు నిర్వహి ంచి నిల్వ ఉంచిన బెల్లం పానకంను పారబోసినట్లు పోలీసులు తెలిపారు. ఇక్కడ తయారు అయిన గుడుంబాను వరంగల్ నగరానికి పలు అడ్డదారుల్లో తరలిస్తున్నట్లు చెప్పారు. గుడుంబా తయారు ఉపయోగించే బెల్లంతో పా టు ముడి సరుకును వరంగల్ పట్టణం నుంచి రాత్రి వేళల్లో గ్రామానికి తీసుక వచ్చి నిల్వ చేసి గుడుంబాను తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి ఆదే గ్రామానికి చెందిన రాయపురం సమ్మక్క అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు సంగెం ఎస్సై భరత్‌కుమార్ తెలిపారు. దాడుల్లో సంగెం ఏఎస్సై సీతారాములు, కానిస్టేబుల్ సురేష్ పాల్గొన్నట్లు చెప్పారు.

సీఎంపై ఎమ్మెల్సీ కవిత విమర్శలు హాస్యాస్పదం

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 4: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జాతీయ నాయకురాలు ప్రియాంకగాంధీపై ఎమ్మెల్సీ కవిత విమర్శలు హాస్యాస్పదమని సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టరు రామగళ్ల పరమేశ్వర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో కవితా వ్యాఖ్యలను ఖండించారు. తెలంగాణ ఇచ్చిందే సోనియాగాంధీ అన్నారు. కవిత మతితప్పి మాట్లాడుతోందన్నారు. ప్రొటోకాల్ గురించి కవిత మాట్లాడేందుకు అర్హతే లేదన్నారు.

ఓసిటీలో అమ్మవారి మహాయాగం



భక్తులకు ఆశీర్వచనములు ఇస్తున్న కాశీ పీఠాధిపతి శ్రీదండిస్వామి

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 4: శ్రీమానస పరివార్ ట్రస్టు శ్రీబాల మానసా మహా విద్యాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం ఓసిటీలో రుద్రసహితశ్రీలలిత మహాత్రిపుర సుందరి మహాయాగం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాశీ పీఠాధిపతి శ్రీ దండిస్వామి హాజరై ప్రత్యేక పూజలు శ్రీలలికుంకుమార్చన, త్రిపురసుందరి సహిత రుద్రపూర్వక, సూక్తహోమాలు, మహా పూర్ణాహుతి, మహదాశీర్వచనములు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నప్రసాద వితరణ జరిగింది. మాజీ కార్పొరేటర్ తత్తరి లక్ష్మణ్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోరంటాల రాజు, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, ఎల్లయ్య పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL సోమవారం 5 ఫిబ్రవరి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

నర్సింగ్ ఆఫీసర్స్‌గా ఎంపికైన పూర్వ విద్యార్థులకు సన్మానం

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 4 : ఇటీవల నిర్వహించిన నర్సింగ్ ఆఫీసర్స్ పరీక్షల్లో ఉద్యోగానికి ఎంపికైన పట్టణంలోని లీడ్ ఫౌండేషన్ పూర్వ విద్యార్థులు వివంచి, అరుణలను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కవి కాసుల రవికుమార్ మాట్లాడుతూ ఎన్నో కష్టనష్టాలను ఓర్చి తమ విద్యాభ్యాసాన్ని పూర్తి చేయడంతో పాటు నర్సింగ్ ఆఫీసర్స్‌గా తమ పూర్వ విద్యార్థులు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు కాసుల శోభ, లక్ష్మీనారాయణ, ఉమ, స్వరూప, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న లీడ్ ఫౌండేషన్ బాధ్యులు

జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలిస్తాం

• పది రోజుల్లో భూమి చూపిస్తా

• వచ్చే జూన్ నెలలో ఇళ్ల పట్టాలిస్తా : ఎమ్మెల్యే దొంతి హామీ



ఎమ్మెల్యే దొంతికి వినతి పత్రం అందిస్తున్న జర్నలిస్టులు

నర్సంపేట, ఫిబ్రవరి 4 : నర్సంపేట పట్టణంలో అర్హత గల జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు అందిస్తానని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని పాకాల జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరుతూ ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్యన వారధిగా ఉంటూ నిత్యం సమాచారాన్ని అందిస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలకు సంబంధించిన భూమిని మరో పది రోజుల్లో చూపిస్తానని పేర్కొన్నారు. అలాగే వచ్చే జూన్ నెలలో ఇండ్ల స్థలాల పట్టాలిస్తానని హామీ ఇచ్చారు. గతంలో జర్నలిస్టులకు కేటాయించిన భూమి విషయంలో పారదర్శకత లేకుండా ఆ భూమిని మెడికల్ కళాశాలకు బదిలీ అయినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఇండ్ల స్థలాల పట్టాలు అందించడంతో పాటు, ఇండ్ల నిర్మాణం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్, సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

చట్ట సభల్లోకి ప్రశ్నించే గొంతును పంపండి



సమావేశంలో అభివాదం చేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

నర్సంపేట, ఫిబ్రవరి 4 : చట్టసభల్లోకి ప్రశ్నించే గొంతును పంపించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు తేజావత్ వాసునాయక్, గుగులోతు భీమానాయక్‌లు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు గత 25 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీ ఎదుగుదల కోసం, నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్న డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్‌ను చట్టసభలకు పంపించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్ మాట్లాడుతూ తన సతీమణి ధన్వంతి 2009లో కాంగ్రెస్ పార్టీ జడ్‌పీ చైర్మన్‌గా పనిచేసి ఈ ప్రాంతంలో అనేక సేవలు అందించారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో అరుణబాయి, మంగీలాల్‌నాయక్, సంతోష్‌నాయక్, సుభాష్‌నాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉర్సు

కరీమాబాద్, ఫిబ్రవరి 4 : నగరంలోని ఉర్సు ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. హజ్రత్ సయ్యదాన మాషూక్ రబ్బాని దర్గా ఉత్సవాలకు ఆదివారం దర్గా పీఠాధిపతులు నవీద్‌బాబా, ఉబేద్‌బాబాల ఆధ్వర్యంలో దర్గాలోని పవిత్ర సమాధివద్ద ఖురాన్ పఠనంతో ఉత్సవాలకు ముగింపు పలికారు. దర్గాను దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నుంచి వేలాది మంది భక్తులు ఈ దార్గాను దర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు దర్గా పీఠాధిపతులు అన్ని రకాల ఏర్పాట్లు చేయడమే కాకుండా ఉత్సవాలు కొనసాగిన ఈ మూడు రోజులు వేలాది మంది భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. ఉత్సవాలను విజయవంతం చేయడంలో సహకరించిన మంత్రి కొండా సురేఖకు, గ్రేటర్ వరంగల్ కమిషనర్ రిజ్వాన్‌బాషా, మేయర్ సుధారాణి, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ, ఏసీపీ బోనాల కిషన్, భక్తులకు, దర్గా పీఠాధిపతులు నవీద్‌బాబా, ఉబేద్‌బాబాలు ప్రత్యేక తెలిపారు.

‘బంగారం’ కోసం భక్తుల తిప్పలు

• గ్రామాల్లో నిబంధనలతో కూడిన విక్రయాలకు ఎక్సైజ్ అధికారుల అనుమతి

• భక్తులు వివరాలు ఇస్తేనే బెల్లం

• రోజురోజుకూ పెరుగుతున్న బెల్లం ధరలు

• ఈ నెల 22 నుంచి జాతర ప్రారంభం

నెక్కొండ, ఫిబ్రవరి 4 : రెండేళ్లకోసారి వచ్చే మేడారం సమ్మక్క-సారలమ్మల జాతరలో భక్తులు మొక్కులను సమర్పించేందుకు బెల్లం బంగారం) ప్రధానం. కాగా, బెల్లం విక్రయాలపై గ్రామీణ ప్రాంతాల్లో నిబంధనలతో కూడిన విక్రయాలకు అనుమతులు ఉండటంతో వ్యాపారులు బెల్లం విక్రయాలపై పెద్దగా ఆసక్తి కనబర్చడంలేదు. తల్లులకు మొక్కులను చెల్లించేందుకు బెల్లం కోసం భక్తుల పూర్తి సమాచారం ఇవ్వాల్సిదిగా ఎక్సైజ్ అధికారులు నిబంధనలు పెట్టడంతో వివరాలను నమోదు చేసుకునేందుకు వ్యాపారులు సుముఖతను చూపడం లేదు. నెక్కొండతో పాటు పరిసర మండలాల్లో గిరిజన తండాలు ఎక్కువగా ఉండటంతో గతంలో గుడుంబా అధికంగా తయారు చేసేవారు. దీంతో గిరిజన తండాల్లో అధిక శాతం తండాలు గుడుంబా కుటీర పరిశ్రమగా మారాయి. అయితే బెల్లం విక్రయించినంత కాలం గుడుంబా తయారీని అరికట్టడం కష్టమని భావించిన ఎక్సైజ్ శాఖ అధికారుల బెల్లం విక్రయాలపై నిబంధనలు విధించారు. అయినప్పటికీ గుడుంబా తయారుకు అలవాటు పడిన గిరిజనులు వరంగల్ తదితర పట్టణాల నుంచి అధిక ధరలను సైతం చెల్లించి బెల్లాన్ని తీసుకువస్తున్నారు. దీంతో భక్తులు సైతం బెల్లానికి అధిక ధరలను చెల్లించక తప్పడం లేదు.



బెల్లం నిలువలు (ఫైల్)

బెల్లం ధరలకు రెక్కలు... భక్తులకు భారం ...

బెల్లం విక్రయాలపై నిబంధనల పుణ్యమా అంటూ కిలో బెల్లం ధర జిల్లా కేంద్రాల్లో రూ.30 నుంచి రూ.50కి, డివిజన్ కేంద్రాలో రూ.70 వరకూ పెరగడంతో మేడారం భక్తులకు భారం అవుతుంది. బెల్లం ధరకు రెక్కలు రావడంతో సామాన్య భక్తులకు భారమౌతుంది. అయినా మొక్కులను చెల్లించుకొనుటకు భక్తులు తప్పని పరిస్థితిల్లో నిషేధం పుణ్యామా అంటూ ఆర్థిక భారాన్ని సైతం మోయాల్సి వస్తుంది.

నిబంధనలు తప్పని సరి పాటించాలి

నరేష్‌రెడ్డి, క్సైజ్ సీఐ, నర్సంపేట



ఈ నెల 22 నుంచి సమ్మక్క-సారక్క జాతర ఉన్నందున నిలువెత్తు బెల్లం కొనుగోలు చేసే భక్తుల పూర్తి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు, ఆధార్ కార్డు జిరాక్స్‌ను, సెల్ నెంబరును వ్యాపారులు తీసుకోవాలి. నిజమైన భక్తులు వారి వివరాలు ఇవ్వడానికి వెనుకాడరు. ఈ విషయంలో వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. గుండుంబా తయారుచేస్తున్న వారిపై తమ సిబ్బంది దాడులు చేసిన సమయంలో బెల్లం ఎక్కడ నుంచి తీసుకు వచ్చిన విషయాన్ని నిందితుడు తెలిపితే అతని వివరాలు షాపులో నమోదుచేసి ఉంటే ఆ వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకోము. నిందితుడి వివరాలు లేకుంటే వ్యాపారిపై కూడా చర్యలు తప్పవు.

బంగారం మొక్కులను చెల్లించేదెలా ...

తాటిపాముల అరుణ, భక్తురాలు, నెక్కొండ



రెండు సంవత్సరాలకు ఒక సారి వచ్చె మహాజాతర అయిన మేడారంలో సమ్మక్క- సారలమ్మలకు ఎంతో ప్రీతిప్రాయమైన బంగారం (బెల్లం) ఎలా సమర్పించాలో తెలియడం లేదు. స్థానిక వ్యాపారులు బెల్లం కొనుగోలు సమయంలో వివరాలు అడుగుతుండటంతో తల్లులకు మొక్కులు చెల్లించుకోనుటకు వివరాలు ఇవ్వడం ఇబ్బందిగా ఉంది. మేడారం జాతరకు జాతీయ హోదాను కల్పించిన ప్రభుత్వం జాతర సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో బెల్లం విక్రయాలకు అనుమతులు ఇవ్వాలి.

కంకర పోశారు... రోడ్డును మరిచారు

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 4 : మండలంలోని కట్ర్యాల గ్రామంలోని డీ ఫ్లోరైడ్ ప్రాజెక్టు నుంచి కట్ట మల్లన్న ఆలయం వరకు వెళ్లే బీటీ రోడ్డును కంకర పోసి వదిలేశారు. కొన్ని నెలలుగా సాగుతున్న పనులు అసంపూర్తిగా ఉండడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జరిగిన జాతర సమయంలో సైతం కంకర రోడ్డుపై నుంచి వెళ్లాలంటే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన రోడ్డు నేటికి పూర్తి కాకపోవడంతో పనులు త్వరగా పూర్తిచేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ దారి గుండా వెళ్లే రైతులు సైతం తమ వ్యవసాయ బావులకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టి సారించి త్వరగా రోడ్డు పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.



కట్ర్యాలలో కంకర పోసి వదిలేసిన రహదారి

బాధిత కుటుంబానికి పరామర్శ

రాయపర్తి, ఫిబ్రవరి 4: మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన మహ్మద్ యాకూబీ మృతదేహానికి ఆదివారం కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. మృతురాలి మనుమడిని కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు ఎండీ మహమ్మద్‌ను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యా నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రెంటాల గోవర్ధన్‌రెడ్డి, నాయకులు మాచర్ల ప్రభాకర్, కృష్ణారెడ్డి, వెంకన్న, భగవాన్ తదితరులు ఉన్నారు.

● చెన్నారావుపేట : మండల కేంద్రంలోని నెంబర్ వన్ కాలనీకి చెందిన సాదు చిరంజీవి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు కంది కృష్ణాచైతన్యరెడ్డి ఆదివారం పరామర్శించి, 50 కిలోల బియ్యాన్ని అందించారు. పరామర్శించిన వారిలో ఎస్సీసెల్ అధ్యక్షుడు నర్మెట్ట సాంబయ్య, నవీన్, మందుల సాగర్, సుదర్శన్ అలువాల ప్రశాంత్, జంగిలి పవన్, కేశవ్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 4 : నర్సంపేట మండలంలోని మాధన్నపేటలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సోమ సమ్మయ్య కుటుంబానికి ఎస్‌కె ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేశెట్టి శ్రీకాంత్ 50కిలోల బియ్యాన్ని ఆదివారం అందజేశారు. ఆయనవెంట ఫౌండేషన్ సభ్యులు గంగుల రంజిత్, పుప్పాల కళ్యాణ్, పోలబోయిన నరేష్, పవన్, సాయి ఉన్నారు.

అనాథ బాలికకు ఆర్థిక సాయం



బాలికకు ఆర్థిక సాయం చేస్తున్న తీన్మార్ మల్లన్న టీం

రాయపర్తి, ఫిబ్రవరి 4 : మండల కేంద్రంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారిన బాలికకు ఆదివారం తీన్మార్ మల్లన్న టీం సభ్యులు రూ.2 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల అంబేద్కర్ కాలనీలో ఐత కొమురమ్మ అనారోగ్యంతో మృతిచెందగా, పది సంవత్సరాల క్రితమే తండ్రి యాకయ్య మృతిచెందాడు. బాలిక ఐత రేణుక అనాథగా మారింది. తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు జనగామ జిల్లా కన్వీనర్ మంద దిలీప్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందచేశారు. అనంతరం పెర్కవేడు గ్రామానికి చెందిన అన్నపూర్ణ రైస్ మిల్లు బాధ్యుడు అబ్బోజు నరేందర్‌చారి 25 కేజీల బియ్యం అందించారు. స్థానికులు యాకయ్య, మల్లేష్, విజయ్, ప్రవీణ్, బ్రహ్మచారి తదితరులు ఉన్నారు.

పంచాయతీరాజ్ ఫోర్త్‌క్లాస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రహమత్ ఎన్నిక

చెన్నారావుపేట, ఫిబ్రవరి 4 : పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడిగా రహమత్‌ను ఆదివారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు ఎల్.సంతోష్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.. అసోషియేట్ అధ్యక్షుడిగా వీర్య, ఉపాధ్యక్షుడిగా శంకర్, ప్రధాన కార్యదర్శిగా చరణ్ కృష్ణ, కోశాధికారిగా నీల, సహాయ కార్యదర్శిగా అనిల్‌కుమార్, కో-ఆప్షన్ సభ్యులుగా ఆర్.శంకరయ్య, మంజుల, మహిళ విభాగం అధ్య క్షురాలిగా స్వర్ణలత, కార్యదర్శిగా శైలజలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడ్‌హాక్ కమిటీ కార్యదర్శి బోలే షావలి, కుమారస్వామి, చంద్రకళ, వెంకన్న, పూర్ణచందర్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల కమిటీ ఎన్నిక

రాయపర్తి, ఫిబ్రవరి 4 : మండల కేంద్రంలోని అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల కమిటీని ఆదివారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడిగా దళితరత్న ఐత యాక య్య, అధ్యక్షుడిగా ఐత రాజు, ప్రధాన కార్యదర్శిగా పీరని రాజబాబు, ఉపాధ్యక్షుడిగా ఐత రంజిత్, కోశాధికారిగా కంతుల శరణ్ తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు.



నూతన అధ్యక్షుడు రాజును సన్మానిస్తు కమిటీ సభ్యులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఖానాపురం, ఫిబ్రవరి 4 : మండలంలోని కొడ్తిమాట్‌తండా కు చెందిన బానోతు రాందాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, రాందాస్‌తో 2001విద్యా సంవత్సరంలో అశో క్ నగర్ టీటీడబ్ల్యూఆర్ పాఠశాలలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కొడ్తిమాట్ తండాలోని రాం దాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.50వేల నగదు ఆర్థిక సాయంతోపాటు ఒక క్వింటా బియ్యం అందజేశారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పూర్వ విద్యా ర్థులు విజయ్, రామకృష్ణ, అశోక్, మొగిలి, శివకృష్ణ, బొంద్యాలు, మల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

దుగ్గొండి, ఫిబ్రవరి 4: పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని మండల బీఆర్ఎస్ పట్టభద్రుల ఇన్‌చార్జి శానబోయిన రాజ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం పట్ట భద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి పట్టభద్రుల నమోదుకై ఫాంలు అందించారు. ప్రతీ గ్రాడ్యుయేట్ పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గుండెకారి రంగారావు, పొగాకు బాలకృష్ణ, కొల్లూరి మోహన్‌రావు, సింగతి కార్తిక్, ప్రమోద్, విజేందర్, శంకర్, రమేశ్ పాల్గొన్నారు.

కుక్కలు బాబోయ్.. కుక్కలు

• గ్రామాల్లో విచ్చలవిడిగా స్వైరవిహారం

• దాడితో భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు

• బెడద నుంచి కాపాడులంటున్న గ్రామస్థులు

చెన్నారావుపేట, ఫిబ్రవరి 4 : మండలంలోని పలు గ్రామాల్లో కుక్కలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలు వీధుల్లో స్వైరవిహారం చేస్తుండంతో ఇంట్లో నుంచి బయటకు రావడినికి పిల్లలు, వృద్ధులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటీవల గ్రామాల్లో మేకలు, కోళ్ల, గొర్రెల మందలపై కుక్కలు దాడులు చేయటంతో మండలంలోని అక్కల్‌చెడ గ్రామం కట్టయ్యపల్లెకు చెందిన అల్లి భిక్షపతికి చెందిన ఆరు మేక పిల్లలు మృతి చెందాయి. ఆదేవిధంగా ఇండ్లల్లో పెంచుకుంటున్న నాటు కోళ్లపై కుక్కలు దాడులు చేయటంతో గ్రామాల్లో నాటు కోళ్ల పెంపకం ఇబ్బందికరంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు బండి నర్సమ్మ, ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కుక్కల కట్టయ్య, ఎల్లాయ్యగూడెం గ్రామానికి చెందిన ఓ చిన్నారిపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. కుక్కల దాడితో భయబ్రంతులకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చొరవ తీసుకొని కుక్కల బెడద నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.



చెన్నారావుపేటలో కుక్కల గుంపు

కుక్కల దాడి నుంచి కాపాడాలి

అరే రాజు. చెన్నారావుపేట



గ్రామంలో కుక్కల బెడద నుంచి కాపాడాలి. కుక్కలు వీధుల్లో తిరుగుతుండటంతో బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నాం. పిల్లలు, వృద్ధులపై కుక్కలు దాడి చేస్తున్నాయి. రాత్రి వేళల్లో కుక్కల అరుపులతో నిద్ర రావటం లేదు. కుక్కల బెడద నుంచి కాపాడాలి. అధికారులు పర్యవేక్షణ చేసి చికెన్ వ్యర్థపదార్థాలను రోడ్డు పక్కన వేయకుండా చూడాలి. గ్రామాల్లో కుక్కల దాడి నుంచి కాపాడాలి.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలను రాయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏబీసీడబ్ల్యూవో సురేందర్

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 4: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని ఏబీసీడబ్ల్యూవో ఎం.సురేందర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్‌లో వార్డెన్ పి.భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగిన ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రేరణ శిక్షణలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికబద్ధంగా, శ్రద్ధతో చదివి పరీక్షలను రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ పరీక్షల ముందు సమయాన్ని వృధా చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీల్లో ఉపాధిహామీ పథకాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న కుమారస్వామి

వర్ధన్నపేట, ఫిబ్రవరి 4 : మునిసిపాలిటీల్లో సైతం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి డిమాండ్ చేశారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉద్యమకారులకు 250గజాల భూమిఇస్తామని ప్రకటించిందని, దానితోపాటు కళాకారులకు రూ.25వేలు ఇస్తున్నట్లుగా ఉద్యమకారులకు కూడా ఇవ్వాలన్నారు. మునిసిపాలిటీల్లో పరిశ్రమలు ఏర్పాటుచేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలి

(5వ పేజీ తరువాయి)

జరపాలని సునితారావు సూచించారు.గ్యారెంటీల ద్వారా మహిళలకు కలిగే ప్రయోజనాలపై మరింత అవగాహన కల్పించాలన్నారు. ఎమ్మెల్సీ కవిత తన స్థాయిని మించి మాట్లాడుతోందని సునితారావు విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, అధినేత్రి ప్రియాంకగాంధీ గురించి ఇష్టారీతిలో మాట్లాడడం అనైతికమన్నారు. సోనియాగాంధీ వల్లే తెలంగాణ వచ్చిందనేది కవిత మరిచిందని, ఆమెకు మతిభ్రమించిందని మండిపడ్డారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలుచేస్తే సహించేబోమని స్పష్టం చేశారు. మోదీ హయాంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. ప్రగల్భాలతోనే మోదీ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు.

మహిళా కాంగ్రెస్ పాత్ర కీలకం

లోక్‌సభ ఎన్నికల్లో మహిళా కాంగ్రెస్ పాత్ర కీలకమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు కాంగ్రెస్ మేనిఫెస్టోను ఇంటింటికి తీసుకెళ్లి మహిళలకు వివరించాలన్నారు.ఇప్పటికే ప్రకటించిన రెండు గ్యారెంటీలతో మహిళలు సంతోషంగా ఉన్నారని,త్వరలో మరో రెండు గ్యారెంటీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించనున్న క్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు విస్తృత ప్రచారం జరపాలని సూచించారు. వరంగల్‌లోని రెండు లోక్‌సభ స్థానాల్లో పార్టీ విజయానికి అండగా నిలవాలన్నారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడానికి అహర్నిశలు కృషి చేయాలన్నారు.

సమష్టిగా కృషి చేద్దాం

లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం సమష్టిగా కృషి చేద్దామని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్య క్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు పార్వ తమ్మ, జనగామ జిల్లా అధ్యక్షురాలు ఇందిర, జయ శంకర్ భూపాలపల్లి అధ్యక్షురాలు శ్రీదేవితో పాటు స్వప్న, సుగుణ, స్రవంతి, గ్రామ, మండల, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పట్నాలు వేసి.. మొక్కులు సమర్పించి..

ఐనవోలులో వారాంతపు జాతర

వేలాదిగా వచ్చిన భక్తులు



ఆలయ ప్రాంగణంలో నజర్‌పట్నాల్లో నిమగ్నమైన భక్తులు

ఐనవోలు, ఫిబ్రవరి 4 : ఐనవోలు మల్లికార్జునస్వామి 3వ ఆదివారం వారాంతపు జాతరకు భక్తులు రాష్ట్రం నలు మూలల నుంచి భారీగాతరలివచ్చారు. శనివారం సాయంత్రం నుంచే భక్తులు ఆలయ ప్రాంగణంలో విడిదిచేశారు. ఆదివారం ఉదయం స్వామి వారికి మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు కల్యాణం నిర్వహించి రుద్రాభిషేకాలు జరిపారు. ఆయా జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో నజర్, చెలక పట్నాలు వేసి బోనం వండి అమ్మవార్లకు స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్క పట్నాల వద్ద పూర్వికులను స్తుతించారు. ఆపదల నుంచి గట్టెక్కించి కోర్కెలు తీర్చమని మల్లన్నను భక్తులు వేడుకున్నారు. మొక్కుల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు భక్తులు ఒడి బియ్యం, వస్త్రాలు, ముతైదు సామగ్రిని ముట్టచెప్పారు. మరి కొందరు రథసేవను నిర్వహించారు. రథంలో ఉత్సవవిగ్రహాలను పెట్టి ఆలయం చుట్టు లాగుతూ ప్రదిక్షణలు చేశారు.